క్లుప్తంగా

కంప్యూటర్, ట్యాలీలలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. 35 రోజులపాటు బెంగుళూరులో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి


మాదిగల జన జాతర సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ రాజా తదితరులు

కడప రూరల్: ఎన్డీఏ కూటమి ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చాయని. ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ రాజా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఈదుముడిలో జూలై 7న నిర్వహిస్తున్న మాదిగల జన జాతర సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30 ఏళ్ల కాలంలో హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. తమ భవిష్యత్తు ఎస్సీ వర్గీకరణపై ఆధారపడి ఉందన్నారు. మాదిగల జన జాతర సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగులయ్య, ఉపాధ్యక్షులు కనకరాజు, కార్యదర్శి వెంకటేష్, కడప నగర అధ్యక్షులు శంకర్, ఓబులేసు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్: పంచాయతీలలో స్వచ్ఛభారత్ మిషన్ కింద నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షులు బాదుల్లా కోరారు. ఆదివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛభారత్ కార్మికులతో పనులు ప్రారంభించాలన్నారు. జీఓ 680 ప్రకారం కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, కార్మికుల భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు నాయకులు ఓబులేసు, ప్రతాప్, నాగేశ్వరరావు, గంగన్న, నాగమణి, గోపి, ఆనందరావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు జూలై నెల 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌వి సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణంలోని సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌లో నాలుగవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు క్రీడల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని ఆయన తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో 5వ తరగతి చేరే విద్యార్థులకు ఇదొక చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. తన వద్ద శిక్షణ పొందిన 10 మంది విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందారని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 98497 20930 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన అన్నారు.


తెలుగు సాహిత్య శిఖరం దివాకర్ల వెంకటావధాని


దివాకర్ల వెంకటావధాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హనుమంతరావు

బద్వేలు అర్బన్ : తెలుగు సాహిత్య శిఖరం ఆచార్య దివాకర్ల వెంకటావధాని అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. దివాకర్ల వెంకటావధాని 120వ జయంతి సందర్భంగా ఆదివారం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశోధకుడుగా, విమర్శకుడిగా పేరుగాంచిన ఆయన తెలుగు సాహితీ రంగానికి చేసిన కృషి అనితర సాధ్యమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వృక్ష సందేశం


ఆకులన్నీ రాలి కళావిహీనంగా ఉన్న బూరుగుచెట్టు (ఫైల్)


పచ్చదనంతో కళకళలాడుతున్న బూరుగచెట్టు

జీవితంలో ఎత్తుపల్లాలు సహజం. ప్రతి ఒక్కరికీ కష్టాలు వస్తుంటాయి.. పోతుంటాయి. కష్టాలకు కుంగిపోకుండా ధైర్యంతో శ్రమిస్తే మళ్లీ సాధారణ జీవితం సాధ్యమే. కడప నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలోని బూరుగచెట్టు ఇదే సందేశాన్ని చాటుతోంది. సరిగ్గా నెల రోజుల క్రితం ఆకులన్నీ రాలి పోయి మోడు బారిన కొమ్మలతో కళా విహీనంగా ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ చిగురించి కొత్త కళ సంతరించుకుంది. పచ్చని ఆకులతో జీవం పోసుకుంది.

– కడప ఎడ్యుకేషన్

యోగాతో ఆరోగ్యం పదిలం


శిక్షణ ఇస్తున్న గురువు భాస్కర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : క్రమం తప్పకుండా యోగా చేయడం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ గోపవరం వెంకట శ్రీనివాసులురెడ్డి అన్నారు. యోగా ద్వారా ఉద్యోగుల్లో పనిచేసే సామర్థ్యం పెరుగుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఆదివారం సిబ్బందికి ఆయన యోగా తరగతులు ప్రారంభించారు. ప్రతిరోజు రెండు గంటలపాటు యోగా గురువు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే యోగా శిక్షణా కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు. యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. వేగవంతమైన జీవన యానంలో ప్రతి ఒక్కరూ అనేక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇందువల్ల బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఉద్యోగులంతా క్రమం తప్పకుండా యోగా తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా సిద్ధ సమాధి యోగా గురువు భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

గోపవరం : మండల వ్యాప్తంగా డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతున్నందున తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామ పంచాయతీ, వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో తాగునీటి పథకాలను శుభ్రపరచాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా మురికినీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాధి ప్రబలితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా పౌర్ణమి ఉత్సవాలు

జమ్మలమడుగు: పట్టణంలోని కన్నెలూరులో వెలసిన గంగమ్మతల్లికి భక్తులు ఘనంగా పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించారు. ఇటీవల 70 సంవత్సరాల తర్వాత గంగమ్మ దేవర నిర్వహించిన గ్రామస్థులు ఏరువాక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నెలూరులోని శ్రీచౌడేశ్వరిదేవి కోలాట బృందం నృత్యాలు, కోలాటం భక్తులను అలరించాయి.

నవరత్నాలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నవరత్న పథకాల చిత్రపటాన్ని బహుకరిస్తున్న దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న సంక్షేమ పథకాలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఆ పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య అన్నారు. ఆదివారం పులివెందుల పర్యటనలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నవరత్న పథకాలతో కూడా భారీ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకాలు కనుమరుగు కానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ స్పందిస్తూ చక్కగా రూపొందించారని ఆదిత్యను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం: మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుని బోనాలు పట్టారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం డి.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. డ్యాన్స్ మాస్టర్ కిషోర్, యువరాజ డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ కిషోర్, పరిపాలన అధికారి సుధాకర్, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో 'థ్యాంక్యూ రిమైండింగ్' షూటింగ్


సన్మానం స్వీకరిస్తున్న సినీ బృందం

కడప కల్చరల్ : ఫొటోగ్రాఫర్ల జీవితాలపై సినిమా తీస్తున్నారు. కడప నగరానికి చెందిన యువ ఫొటోగ్రాఫర్ల బృందం తమ జీవితాలనే కథా వస్తువుగా తీసుకుని కెమెరా నుంచి డైరెక్షన్ వరకు ఎదిగారు. అందులో భాగంగా స్థానిక ఫొటోగ్రాఫర్ జాకట రమేష్ దర్శకత్వంలో 'థ్యాంకూ రిమైండింగ్' పేరిట సినిమా ఫొటోగ్రాఫర్ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని సినిమా షూటింగ్ ప్రారంభించారు. నెల రోజులుగా పులివెందులకు చెందిన ఫొటోగ్రాఫర్ మహేష్ కథానాయకునిగా ఆయా ప్రాంతాలలో షూటింగ్ చేస్తున్నారు. ఆదివారం కడప నగరంలో కొన్ని దృశ్యాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు రమేష్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ జీవితం, వారికుండే కష్టనష్టాలు, గౌరవం, గొప్పతనాన్ని, ఫొటోగ్రాఫర్లకు సమాజంలోగల ప్రాధాన్యత తదితర అంశాలతో చిత్రీకరిస్తున్నామని తెలిపారు. ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా ఆ సినిమా దర్శకుడు, కథానాయకుడు, కెమెరామెన్‌లను అభినందించి సత్కరించారు.

వర్షం కురిసె.. విత్తుకు కదిలె


మండలంలో విత్తన సాగుకు పొలంను సిద్ధం చేస్తున్న రైతు

- ఇటీవల కురుస్తున్న వర్షాలు
- ఖరీఫ్ ప్రారంభం కావడంతో పొలం పనుల్లో రైతన్నలు బిజీ

ఎర్రగుంట్ల: ఈ ఏడాది ముందస్తుగా కురిసిన వర్షాలకు రైతులు ముంగారు సేద్యాలు చేసి, సాగుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అదునులో పదునైన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా వేరుశనగ సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జూలై ఆఖరు వరకు విత్తన సాగు చేసుకునేందుకు అనుకూలమని వ్యవసాయాధికారులు తెలిపారు.

ట్రాక్టర్ సేద్యాలకు రైతులు మొగ్గు..

విత్తన సాగుకు, ముంగారు సేద్యం పనులకు గతంలో కాడెద్దులు తప్పనిసరి. ప్రతి ఇంటా కాడెద్దులు ఉండేవి. అయితే రానురానూ కాడెద్దులు కనుమరుగవుతున్నాయి. ధరలు పెరిగిపోయి, ఎద్దలను పోషించలేని పరిస్థితి. రెడీమేడ్‌గా ట్రాక్టర్ సేద్యాలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు బాడుగలు చెల్లించాలి. ట్రాక్టర్ యజమాను విత్తన సాగుకు గంటకు రూ.2 వేలు నుంచి రూ.2500 వరకు అద్దె తీసుకుంటున్నారు. ఈ లెక్క ప్రకారం సగటున ఐదెకరాలు పొలంలో ఎరువులు, సేద్యం పనులకు సుమారుగా రూ.35 వేలు, నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

జూలై అఖరి వరకు సాగుకు అనుకూలం



ఖరీఫ్ సీజన్‌లో జూలై ఆఖరు వరకు వేరుశనగ విత్తుకోవచ్చు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. తేమ ఆరిపోతుందనే ఆందోళన చెందకుండా రైతన్నలు సాగు చేసుకోవచ్చు. వేరుశనగతో పాటు చిరుధాన్యల పంటల సాగు చేసుకోవచ్చు. రైతులకు అవసరమైన సందేహాలను నివృత్తి చేసేందుకు ఆయా గ్రామాలలోని వ్యవసాయ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఆర్‌బీకేలో సేవలను రైతులు వినియోగించుకోవాలి.

–శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, ఎర్రగుంట్ల మండలం

విద్యతో ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రసాద్

కడప రూరల్ : విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన.. వెంకట ప్రసాద్ మాట్లాడుతూ నమ్మకం మనిషిని నడిపిస్తుందని తెలిపారు. తొగట వీర క్షత్రియులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, నగర అధ్యక్షులు కల్యా సుధాకర్, బీసీ నాయకులు గోవిందు నాగరాజు, బొల్లు సోమశేఖర్, డాక్టర్ బండారు శ్రీనివాసులు, పల్లా మురళీకృష్ణయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌కు తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర, జిల్లా, నగర శాఖ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో తొగటవీర క్షత్రియుల తరపున ఏకైక శాసనసభ్యునిగా ఎన్నిక కావడం పట్ల అభినందనలు తెలియజేశారు.

బీసీ హాస్టల్స్‌ను వెంటనే తెరవాలి


సికెదిన్నెలో మూతపడిన హాస్టల్‌ను చూపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లాలో మూతబడిన బీసీ హాస్టల్స్‌ను తిరిగి వెంటనే తెరచాలని ఏఐఎస్‌బీ, పీపీఎస్‌యూ, ఆర్‌వైఎఫ్ నాయకులు జయవర్ధన్, సుబ్బరాయుడు, బాస్కర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆదివారం సికెదిన్నె మండలంలో మూతబడిన బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ హాస్టల్స్ మూసివేతకు కారణమైన వార్డెన్ రఘురామరాజును వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. గతంలో ఈయన టంగటూరు, చిలంకూరు, వీరపనాయునిపల్లి మండలాల్లో పనిచేశారని తెలిపారు. రఘురామరాజు ఒక్క హాస్టల్‌ను కూడా అభివృద్ధి చేయకుండా విద్యార్థులు లేరని 15 సంవత్సరాలలో మూడు హాస్టల్స్ మూతపడటానికి కారణమయ్యారని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై పది రోజులు అవుతున్నా సక్రమంగా విధులకు హాజరుకాకుండా హాస్టల్ మూసివేయడానికి ప్రయత్నం చేస్తున్న రఘురామరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి గొడ్డలి పెట్టుగా మారిన జీఓ 117ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లాశాఖ అభ్యాసవర్గ సమావేశాన్ని ఆలంఖాన్‌పల్లెలోని యతి ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కావడానికి, ఉపాధ్యాయ పోస్టుల కుదింపుకు వారి పనిభారం పెరగడానికి కారణమైన జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్, పీఈటీలకు ప్రమోషన్లను చేపట్టాలన్నారు. 12వ పీఆర్‌సీకి సంబంధించిన మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటామిరెడ్డి, రాష్ట్ర సేవా కార్యదర్శి ఎరుకలరెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టం చెన్నయ్య, దేవిరెడ్డి కొండారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. 11వ పీఆర్‌సీలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. 12వ పీఆర్‌సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం కింద రూ.15 వేల చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌భాషా, శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, గుర్రయ్య, భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రామ్‌భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలజ్యోజి, అబ్దుల్‌సత్తార్, జిల్లా కౌన్సిలర్లు ఆదిశేషారెడ్డి, రామెహ్మన్ రెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

శిల్పారామంలో నృత్య హేళ

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు నృత్యాలతో అలరించారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటున్న రాయలసీమ కింగ్స్ టీమ్ సభ్యులు హుషారైన నృత్యాలతో సందర్శకులను మైమరిపించారు. యువత కావడంతో విశేష ప్రాచుర్యంలో ఉన్న సినిమా పాటలకు నృత్యాలు చేయడంతో పదే పదే సందర్శకులు కరతాళ ధ్వనులతో ప్రోత్సహించారు. శిల్పారామాల రాష్ట్ర పాలనాధికారి మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నృత్యం చేస్తున్న యువతులు